ఒక్కమాట నాకేటు

త్రిపురదత్తాత్రేయ శర్మ

పద్మనాభరావుకి అంతులేని ఆస్తి వుంది. అయినా ఎంతోకాలంగా సంతానం లేదు. భార్యతోసహా తీర్థయాత్రలు చేశాడు. రామేశ్వరంలో నాగప్రతిష్ఠ చేశాడు. ఒకగుడి కట్టించాడు. కనపడ్డ స్వాములందరికీ మ్రొక్కాడు — ఎన్నో వ్రతాలు చేశారు—నోములు నోచారు. అతను ఏడాది 'సిద్ధమకరధ్వజం' తిన్నాడు— అతని భార్య వసంతకుసుమాకరం సేవించింది. దేవుడు దయతల్చాడు — పెళ్లి అయిన 14 ఏళ్లకి గర్భవతి అయింది. నెలకట్టిన నాటినుంచీ యిల్లే హాస్పిటలై పోయింది.

ఆ నాడామె ప్రసవవేదన పడుతోంది. వూళ్లోవున్న పెద్ద లేడీడాక్టర్లు అంతా అక్కడేవున్నారు. ఎగ్జామినేషన్‌రూంకి ముందు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కూర్చొనున్నాడు పద్మనాభరావు. ఉండి వుండి వొక్కసారి బిట్టుగా విట్టూరుస్తున్నాడు. ఎదురుగా శిలువమీద బలి అయిపోయిన ఏసుక్రీస్తుబొమ్మ వొంక నిర్నిమేషంగా చూస్తూ చలించిపోతున్నాడు.

ఎగ్జామినేషన్‌రూమ్ తలుపు తెరుచుకొంది. డాక్టరు బయటికి వచ్చింది. పద్మనాభరావు వొక్క అంగలో డాక్టర్ని జేరుకొన్నాడు. తన దీనతంతా వొక్క చూపులో వ్యక్తంచేస్తూ డాక్టరు వొంక చూచాడు—డాక్టరు ఆయన కళ్లలోకి వొక్కసారి చూచింది. అతనేలో అడగబోయాడు. అంతలోనే ఆమె ముందుకు

నడిచివెడుతూ—

'మేజర్ ఆపరేషన్ చెయ్యాలి. బ్లడ్ కావాలి—బ్లడ్ బ్యాంక్‌కి వెళ్లి యిది చూపించి బ్లడ్‌బాటిల్ వొకటి పట్రండి.' అంటూ వో కాగితం అతనిచేతికియిచ్చింది.

బ్లడ్‌బాంక్‌లో డాక్టరు మైక్రోస్కోపు లెన్స్‌లోంచి చూస్తున్నాడు. అతని కంటికి ధనవంతులదీ—నిరుపేదలదీ, విజ్ఞానులదీ మూర్కులదీ—రిక్షావాడిదీ— కారు వోనరుదీ—అందరి రక్తం వొక్కటిగానే కనబడుతోంది. అతను సాంకేతికంగా ఏర్పరచుకొన్న 'గ్రూపులు' తప్పితే అంతా వొకటే ప్రవాహం—ఒకే చైతన్యం.

పద్మనాభరావు ఆదుర్దాగా అతని ముందు కొచ్చాడు. అతను తలెత్తి చూశాడు.

'నమస్కారం' అని ఆ కాగితం అతని చేతిలోపెట్టి జేబులోంచి వందరూపాయల కాగితాలు బయటికి లాగి అతని చేతిలో పెడుతూ 'తొందరగా యియ్యండి డాక్టర్' అన్నాడు.

'ఉంచండి...పుంచండి' అంటూనే చెయి జాపాడు డాక్టర్. అది అందుకొని 'వార్తండి' అని టేబుల్‌మీదవున్న రిజిస్టర్ తిరగవేసి ఫ్రిజిడైర్ దగ్గరకు వెళ్లి తలుపు తెరచి చూచాడు. ఆందోళనగా తిరిగివచ్చాడు.

'వెరీసారీ...'ం' గ్రూపు బ్లడ్ లేదు... రాత్రి ఎమర్జన్సీకి వాడేశారు'—అన్నాడు.

పద్మనాభరావు కాళ్ళక్రింద భూమి క్రుంగిపోయింది.

దిగ్భ్రాంతుడై పోయాడు. డాక్టరే అతనికి చైతన్యాన్ని కల్పిస్తూ 'నా దగ్గర రిజిస్టర్‌డ్ డోనార్స్ లిస్ట్ వుంది. అడ్రస్ యిస్తాను. మనిషిని పట్రండి వెంటనే తీసేస్తాను' అంటూ పుస్తకం వెతికి అతనికొక అడ్రసు వ్రాసి యిచ్చాడు.

ఆకాశం విషాదంగా కన్నీరు కారుస్తున్నట్టుగా వర్షం కురవసాగింది. ఉండీ వుండీగా కురుస్తున్న ఆ వానలో పద్మనాభరావు కొంచెం ఆ మురికివీట ముంగిట ఆగింది. లోపలికి చొచ్చుకు పోదామని చూచిందికాని వీలు కాలేదు. గట్టిగా నిట్టూర్చి ఆగిపోయింది. కార్లోంచి దిగాడు పద్మనాభరావు. ఆ మురికి వీధిగుండా వెడుతుంటే అతనికి నేలమీద నడుస్తున్నట్టుగా లేదు. పట్టువంచె చెంగు ఎత్తిపట్టుకొని నిదురగా కనపడ్డ వాళ్లని 'బిక్షాలు యిల్లెక్కడ?' అని అడిగాడు—

వో కుర్రవాడు ఆయన్ని ముందుకు తీసుకు వెళ్లాడు. వో గుడిసెముందు ఆగి 'ఇదే' అని చెప్పాడు.

'బిక్షాలూ' అని ఆదుర్దాగా పిలిచాడు.

చీకటిగా మృత్యువు దాక్కొన్న గుహలా వున్న ఆ గుడిసెలోంచి బయటికివచ్చి,

'ఎవరు బాబూ?' అన్నాడు, అలాంటి మనిషి తనకోసం దావటంచూసి ఆశ్చర్యపోతూ.

'ఎంత డబ్బయినా యిస్తాను...నీతో పనుంది...నువ్వొస్తావా హాస్పిటలుకు రావాలి'

'దేనికిబాబూ?'

'నా భార్య చాలా ఆపదలో వుంది... ఆపరేషన్ చెయ్యటానికి...రక్తం కావాలిట...డాక్టరు నిన్ను తీసుకురమ్మన్నాడు'అని ఆయాసపడుతూ చెప్పాడు.

'ఇప్పుడెట్టా బాబూ...మా ఆడదానికి వొళ్ళు బాగోలేదు...మూసేకన్నూ...తెరిచే కన్నుగా వుంది...నాలుగురోజుల్నుంచీ దానికి దారకం లేదు. రెండురోజులుగా నా గ్గంజి లేదు. మంచంకూడ లేకపోతే మరీ లోచెడిపోద్ది బాబూ...'అని అంటుంటే అతని కళ్ళవెంట నీళ్లొచ్చాయి.

'నీకేం ఫరవాలేదు.....నువ్వొక్కసారి హాస్పటల్‌కిరా.....పని అవగానే నీరోపాటే డాక్టర్ని పంపుతాను. కావలసినవన్నీ కొనిస్తాను. ఇదిగో కావాలంటే యీ డబ్బుంచుకో'అని వందరూపాయల కాగితం బయటికి లాగాడు.

'క్షణంసేపుకూడావీవారనియ్యటం లేదు బాబూ...వొంటే గోడుగా ఏడుస్తోంది. మరెవరినన్నా పిల్చికెళ్లండి'అంటూ లోపలికి పోబోయాడు.

పద్మనాభరావు గుండె జారిపోయింది. ఆందోళన అధికమైంది.

'బిక్షాలు...యింకెవ్వరూ లేరు..... బాబ్బాబు...ప్రాణం కాపాడు...నీకెంతయినా యిస్తాను'అంటూ అతని చేతులు పుచ్చుకొన్నాడు. ఇంట్లోంచి 'ఏంటిమామా?' నీరసంగా అడిగింది బిక్షాలు పెళ్లాం—లోపలికెళ్లి అంతా ఆమెతో చెప్పాడు—

'ఎళ్లిరా మామా...నూరుమేళ్ళు మరం చేస్తే వొక్కమేలు మన్సి కాస్తదంటారు—'

ఆమె మాటలతో బిక్షాలుకి ధైర్యం వచ్చింది—

ఆమె పాలిపోయిన ముఖంలోకి, లోతుకి దించుకుపోయిన కళ్ళలోకి చూస్తుంటే అతనికళ్లలో నీళ్లు తిరిగాయి—

ఎదురుగావున్న ఏసు బొమ్మవైపు వొక్కసారి చూచి 'బేగె వొచ్చేస్తానే'... అంటూ ఆమె చేతిని విమిరి బయటికొచ్చాడు — పద్మనాభరావు డోరుతీసి పట్టుకొని బిక్షాల్ని తన ప్రక్కన కూర్చోపెట్టుకొన్నాడు.

'ఆమెకి జబ్బేవిటి?' అని ఆప్యాయంగా అడిగాడు.

'ఏందో బాబూ నాలుగు రోజులనాడు ధర్మాసుపత్రికి పోతే ఎర్రనీళ్లు పోసిన్రు ... నాల్రోజులుగా వొళ్ళెపాణం పోయే పాణం—'

'అయ్యో...పాపం' అన్నాడు పద్మనాభరావు—కొద్దిక్షణాల్లో బిక్షాలు బెడ్ బ్యాంకులో మంచంమీద పడుకొని వున్నాడు. అతని శరీరంలోంచి బొట్లు బొట్లుగా రక్తం సీసాలోకి పడుతోంది. ఎదురుగా వున్న ఏసుక్రీస్తు బొమ్మకు దణ్ణం పెట్టుకొన్నాడు. చాలీ చాలని గంజి మెరుకులతో కూడ పెట్టుకొన్న రక్తపు చుక్కలవి. వాటిని పీల్చుకొంటుంటే దాని వొంకే చూస్తూ అలసటు పడిపోయి నట్టుగా వుండిపోయాడు. అలసటతో బలహీనంగా వున్న అతనికళ్లు మూతలు పడ్డాయి ఏం జరిగిందో అతనికి తెలియదు. అతను మేలుకొనేప్పటికి వార్డ్‌బాయి రొట్టె పాలు — తెచ్చి ముందుంచాడు. వాటిని చూడగానే దారకం లేకుండావున్న భార్య జ్ఞాపకం వొచ్చింది. అవి ముట్టుకో బుద్ధికాలేదు. డాక్టరొచ్చి—

'తిను...లేకపోతే కళ్లు తిరుగుతాయి... నరవలేవు' అన్నాడు పల్స్ చూస్తూ. అతను మెదలకుండా తిని పాలు త్రాగాడు. వార్డుబాయ్‌వచ్చి 'అయనేవన్నాయిచ్చాడా?' అని అడిగాడు—

'లేదు —

'అప్పుడే పుచ్చుకోవాలి...కరువాత వాళ్ళు మరి ముఖం చూడరు'అని వెళ్లిపోయాడు—

బిక్షాలు తూలుకొంటూ నడుస్తూ డాక్టరు రూం ముందుకు వచ్చాడు.

గుమాస్తా అతన్ని పిలిచి వోచరుమీద ఎనిమిదిరూపాయలకి సంతకం పెట్టించుకొని ఏడు రూపాయ అతని చేతిలో పెట్టాడు.

'పిచ్చిరాయాల...మనతో అవసరం వుండగానే గుంజాకోవాలి. అవసరం తీరితే పైసాకూడా ఎవడూ యీడు' బిక్షాలుకి అర్థంకాక అతని ముఖంలోకి చూచి—దణ్ణంపెట్టి వెళ్ళిపోయాడు.

ఒకప్పుడు వంశప్రతిష్ఠకు గర్వకారణమైన రక్తం, రక్తంవోడ్చి శ్రమించానని బాధపడే రక్తం, రుధిరధారలు పారించానని విర్రవీగే వీరరక్తం తరతరాలుగా నీతి, నిజాయితీలతో పునీతమైందని పలవరించే పవిత్రరక్తం కదనరంగంలో దేశరక్షణకై క్షతగాత్రులైన వీరసైనికుల ప్రాణాలు కాపాడటానికై అవసరమైనరక్తం, ప్రాణాపాయంనుంచి మనిషిని కాపాడటానికి—అమృతమై సాయపడే రక్తం—ప్రతిమనిషికి ప్రాణం తరువాత ప్రియమైనదానికి అతనికి వచ్చిన ప్రతిఫలం—అది. దానితో చావు బ్రతుకులమధ్య వంతెన కడదామని అతని ఆశ. 'ఈ నాలుగురూకలే నాలుగురోజులు. ముందొచ్చివుంటే' అనుకొంటూ లాటరీ, పళ్ళూ కొనుక్కొని—అంతులేని ఆరాటంతో యింటికి బయలుదేరాడు.

ఆపరేషన్ థియేటర్ముందు పచార్లు చేస్తున్న పద్మనాభరావు వొంట్లో రక్తం పోటెత్తుకు ప్రవహించసాగింది— మెదడు నరాలు బద్దలయ్యేట్టుగావున్నాయి. గుండె కొట్టుకోటం లోకటిపోటులా అనిపించసాగింది. ఎదురుగావున్న ఏసుప్రభువు బొమ్మకి ఎన్నోసార్లు దణ్ణం పెట్టుకొన్నాడు.

థియేటర్ తలుపు తెరుచుకొంది. డాక్టరు చేతులు ముడుచుకొంటూ బయటికివస్తూ, 'కంగ్రాచ్యులేషన్స్ ... మగబిడ్డ ... తల్లీబిడ్డా కులాసాగా వున్నారు...'

ఒక్కసారిగా అతని హృదయం మీంచి బరువు దింపినట్లుగా అయింది. కొద్ది క్షణాలక్రిందట ఆవేదనతో ఘూర్ణిల్లిన అతని హృదయం ఆనందంతో—గిరికీలు వేసింది.

బిక్షాలు లొప్పుకొంటూ తన గుడిసెలోకి ప్రవేశించాడు— మూలుగు వినిపించటం లేదు. మంచం దాటివున్న ఆమె పాదాలు చూశాడు. అసలే కట్టెలా వున్న ఆమెపాదాలు కొయ్యబారిపోయాయి. చేతితో తాకాడు చల్లగా వున్నాయి.

ఆమె ముఖంలోకి చూచాడు—

అరణ్యంలో అర్ధరాత్రి రాలిపోయిన పుష్పంలా వుంది. అతని కళ్ళల్లో నీళ్ళు యిగిరిపోయాయి. కాంతి విహీనమైన కళ్ళతో ఏసు ప్రభువు వొంక—'ఏమిటిది?' అని చూస్తున్నాడు.

పతితులు, దరిద్రులు, బాధా తప్తులు, క్షుధార్తులు ఎక్కడ వుంటారో—అక్కడే వుంటాయంటారు భగవానుని పాదాలు! అవి అక్కడ లేవు...వున్నా అవి చల్లబడి కొయ్యబారిపోయాయి!

మనిషి మట్టయిపోయినా మనసు రాయి కాలేదు బిక్షాలుకి. విధి చేసిన గాయం యింకా పచ్చిగానే వుంది. బిక్షాలు దిక్కు తోచక తిరుగుతూ హాస్పిటల్‌వైపు వెళ్ళాడు. స్పెషల్ రూమ్స్‌ముందునుంచి నడిచి వెడుతున్నాడు—వో రూంలో పద్మనాభరావు కుర్చీలో కూర్చొని ఏపిల్‌కాయ కోసి పెడుతున్నాడు—ఆమె పక్కలో పసిపాప వుంది—

ఆమె బుగ్గల్లోకి మళ్ళీ గులాబిరంగు వచ్చింది!

అతని ముఖంలో ఆనందం వుంది!—

ఎదురుగా ఏసుక్రీస్తు పటం వుంది—

దానిమీద వాడని మల్లెలమాలవుంది—

వారి చుట్టూ కాంతి, ఆరోగ్యం, ఆనందం వ్యాపించి వుంది. భగవానుని పాదపీఠంకూడా అక్కడే స్థాపితమై వుంది. దానిమీద వున్నాయి వారికి దాస్యం చేసే భగవానుని పాదాలు. ●